## క్లుప్తంగా

### వాకర్స్‌కు ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ



మాట్లాడుతున్న ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సీఓఓ డాక్టర్ శ్రీధర్‌ముని

**తిరుపతి కల్చరల్:** ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో సోమవారం వాకర్స్‌కు ఉచితంగా ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ప్రివిలేజ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ మేరకు తిరుపతి వాకర్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ కొత్త ప్రివిలేజ్ కార్డులను ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్డుల ద్వారా హాస్పిటల్‌లో అన్ని రకాల చికిత్సలకు రాయితీ లభిస్తుందని, అందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సీఓఓ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ వాకింగ్‌తో ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. అంతేకాక హాస్పిటల్‌లో రూ.1999లకే మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, వాకర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

### బాలకృష్ణ ఆరోపణలు అవాస్తవం




భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్న బాధితుడు భాస్కర్ నాయుడు

**తిరుపతి కల్చరల్:** తిరుచానూరు గ్రామ లెక్కదాఖల సర్వేనంబర్లు 249/4, 249/5 భూమి విషయమై బాలకృష్ణను తాను బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు చేసిన ఆరోపణలు అవాస్తమని తిరుపతికి చెందిన భాస్కర్ నాయుడు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగ బాలకృష్ణకు సంబంధించిన 1.36 ఎకరాల భూమిలో 81 1/2 సెంట్ల భూమిని 2017 ఆగస్టు 16వ తేదీన 439/2017 రిజిస్టర్ డాక్యుమెంట్ పత్రంతో రూ.కోటి 5 లక్షల 95 వేలు చెల్లించి తన భాగస్వామి నాగినేని సుబ్రమణ్యం బాబుతో కలిసి కొనుగోలు చేశామని తెలిపారు. అయితే బాలకృష్ణ సదరు భూమి విషయంలో తాము నకిలీ పత్రాలతో బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపించడం సరికాదన్నారు.

### మండల మీట్ రేపు

**చంద్రగిరి:** మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ వర్గాలు సోమవారం తెలిపాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల స్థాయి అధికారులు హాజరయ్యే, మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

### శ్రీవారి సేవలో ప్రముఖులు



మధ్యప్రదేశ్ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ

**తిరుమల:** తిరుమల శ్రీవారిని మధ్యప్రదేశ్ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

### ఆగమోక్తంగా మృత్యుంజయ స్వామికి అభిషేకం



అలంకరణలో స్వామివారు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూదితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# ప్రభుత్వంపై ఉద్యమిస్తాం



- పని లేక పస్తులు ఉంటున్న భవన నిర్మాణ కార్మికులు
- కూటమి నేతల కనుసన్నల్లో బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్న ఇసుక
- నగరంలో రూ.10 వేల వరకు పలుకుతున్న ట్రాక్టర్ ఇసుక
- అసెంబ్లీ, ఎమ్మెల్యేల గృహాల ముట్టడికి సిద్ధమైన భవననిర్మాణ కార్మిక సంఘాలు

**తిరుపతి సిటీ:** ఉచిత ఇసుక అంటూ ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఉచిత ఇసుక ఉత్తమాటే అని నిరూపితమవుతోంది. తిరుపతి నగరంలోని సుమారు పదివేల మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులు ఉంటున్నారు. రీచ్‌ల నుంచి రాత్రికి రాత్రే వందల ట్రాక్టర్ల ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలిపోతుంటే, ఇక్కడ పనులు లేక వారు అల్లాడుతున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక దొరకాలంటే రూ.10వేలు పెట్టి బ్లాక్‌లో కొనాల్సిందే. మరో వైపు కూటమి నేతల కనుసన్నుల్లో ఇసుక నగర ప్రజలకు అందడం లేదు. త్వరలో అన్ని భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అసెంబ్లీ, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించే కార్యాచరణ రూపొందిస్తున్నాం అంటూ నగరంలోని భవన నిర్మాణ కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాయి.

#### ముట్టడికి సిద్ధం..



కూటమి నేతలు ఎన్నికల ముందు ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలను మోసం చేశారు. ఉచితం దేవుడెరుగ.. కనీసం చిన్నపాటి నిర్మాణాలు చేద్దామంటే ఇసుక దొరకడమే కష్టమైంది. బాబు సర్కారు తీరుతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారు. త్వరలో కార్మిక సంఘాలతో కలసి ఉద్యమిస్తాం. అసెంబ్లీని, ఎమ్మెల్యే గృహాలను ముట్టడించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

**- శ్రీరాములు, ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, తిరుపతి**

#### ప్రభుత్వాన్ని నిలదీస్తాం



ఉచిత ఇసుక అంటూ ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం మరో మారు ఉచితానికి మొండి చేయి చూపింది. కూటమి నేతల కనుసన్నల్లో రాత్రికి రాత్రే ఇసుకను మాయం చేస్తున్నారు. ఇసుక కొరత సృష్టించి బ్లాక్‌లో ట్రాక్టర్ ఇసుక సుమారు రూ.7 వేల నుంచి రూ.10 వేలకు అమ్ముతూ పేదల కడుపుకొడుతున్నారు. కార్మికులకు పనులు దొరక్క నరకయాతన అనుభవిస్తున్నారు. ఉచిత ఇసుకపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.

**- ఎన్.శ్రీనివాసులు, సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, తిరుపతి**

#### నడిరోడ్డున పడ్డారు



ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన బాబు సర్కార్ ఇసుక నుంచి సంపద సృష్టించే పనిలో పడింది. ఉచిత ఇసుక అంటూ మభ్యపెట్టి భవన నిర్మాణ కార్మికులను రోడ్డన పడేసింది. తిరుపతిలో భవన నిర్మాణ కార్మికులు ఒక రోజు పని దొరికితే రెండు రోజులు పస్తులతో పడుకుంటున్నారు. ప్రభుత్వ తీరు మారకపోతే నిరసనలు తప్పవు

**- మునిరాజ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు, తిరుపతి**

#### ఉచిత ఇసుక ఇచ్చేవరకు పోరాడుతాం



కూటమి ప్రభుత్వం తాము ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక అమలు చేసితీరాలి. లేదంటే అన్ని కార్మిక సంఘాల ఐక్యతతో ప్రభుత్వంపై పోరాటాలు చేస్తాం. ఉచిత ఇసుక హామీతో భవన నిర్మాణ రంగం పుంజుకుంటుంది అనుకున్నాం. కానీ అందుకు విరుద్ధంగా ప్రభుత్వం ప్రవర్తిస్తోంది. కొందరు కృత్రిమ కొరత సృష్టించి వందల ట్రాక్టర్ల ఇసుకను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.

**- హరిబాబు, వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు, తిరుపతి**

#### పని దొరకడం లేదు



మేస్త్రీగా పని చేస్తున్నాను. కనీసం వారంలో నాలుగు రోజులు కూడా పని సరిగా ఉండడం లేదు. బిల్డింగ్ యజమానులు ఇసుక ట్రాక్టర్ బిల్డింగ్ దగ్గరకు వస్తే పనికి పిలుస్తారు. లేదంటే ఈ రోజు పనిలేదు అంటున్నారు. టీడీపీ నాయకులు తిరుపతి రూరల్‌లో రాత్రి సమయాల్లో వందల ట్రాక్టర్ల ఇసుకను ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. మాలాంటి కార్మికులను రోడ్డున పడేశారు.

**- ఎస్.నారాయణ, మేస్త్రీ, తిరుపతి**

#### తిండి కరువైంది



పనులు దొరకడం లేదు. ఒకరోజు ఉంటే రెండోరోజు ఉండదు. ఇసుక కొరతతో మేము ఏమి చేయాలో పాలుపోవడం లేదు. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. మూడు పూటలా తృప్తిగా తిని ఎన్నో రోజులవుతుందో ? రేషన్ షాపులో బియ్యం తప్ప ఏమీ ఇవ్వలేదు. కనీసం గత 7 నెలల నుంచి ప్రభుత్వం నుంచి ఒక్క పథకం కూడా మాకు అందలేదు. మాలాంటి కూలీలు ఎలా బతకాలి.

**- యశోదమ్మ, భవన నిర్మాణ కూలి, తిరుపతి**

### కళాకారుడు శ్రీధర్‌కు నివాళి

**తిరుపతి కల్చరల్:** టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సీనియర్ కళాకారుడు ఆలూరు శ్రీధర్ మృతి పట్ల ప్రాజెక్టు కళాకారులతో పాటు పలువురు నగర ప్రముఖులు ఒక ప్రకటనలో తమ సంతాపాన్ని ప్రకటించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కళాకారుడు శ్రీధర్ సోమవారం మృతి చెందారు. రాష్ట్రంలోనే తబలిస్ట్‌గా, రిథమ్‌ప్యాడ్ ప్లేయర్‌గా విదేశాలలో అనేక ప్రతిష్టాత్మకమైన వేదికల ద్వారా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుల దర్శకత్వంలో అనేక రికార్డింగ్‌ల్లో తబలా, రిథమ్‌ప్యాడ్ వాయించారు. ఆయన తల్లి ప్రముఖ హరికథా భాగవతారిణి వరలక్ష్మి, సోదరుడు ఆలూరు రాజమోహన్ కూడా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులుగా సేవలించారు. ఆయన మృతి సంగీత లోకానికి తీరని లోటని ప్రాజెక్టు కళాకారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కళాకారులు ఉదయభాస్కర్‌రెడ్డి, హేమప్రకాష్, దేవానంద, అమరావతి, మాధవి, హేమకుమార్, ఘంటసాల గానకళాపీఠం అధ్యక్షుడు మల్లం విజయకుమార్‌రెడ్డి ఉన్నారు.

### పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ వంశీ పశువైద్యాధికారి

**చంద్రగిరి:** రానున్న మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని నారావారిపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ వంశీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో పశువులను ఎత్తయిన, సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పశువులను బలహీనమైన పాకలు, చెట్ల కింద ఉంచకూడదని, విద్యుత్ స్తంభాలు, వేలాడే తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర కట్టి వేయకూడదని సూచించారు. వాటికి సరిపడా గడ్డి, దాణాను నిత్యం అందుబాటులోకి ఉంచుకునే రైతులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గొర్రెలు, మేకలను నది పరివాహక ప్రాంతాల్లో కాకుండా సురక్షిత ప్రదేశాల్లో మేపుకోవడం ద్వారా ఎలాంటి ముప్పు వాటిల్లదన్నారు. తుపాను సమయంలో పశు వైద్యుల సూచనలు, సలహాలను పాటించడం ద్వారా వాటికి ఎటువంటి వ్యాధి సోకకుండా కట్టడి చేయవచ్చన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు చేసే ముందస్తు జాగ్రత్తలను ప్రతి పాడి రైతు తప్పకుండా పాటించాలని కోరారు.

## హెల్ప్ లైన్‌ను సద్వినియోగం చేసుకోండి



హెల్ప్‌లైన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

**తిరుపతి తుడా:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురిసే వర్షాలకు ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా హెల్ప్ లైన్ నంబర్ 0877 2256766కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య కోరారు. తుపాను బాధితుల సహాయం కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్‌ను సోమవారం కమిషనర్ పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కాల్స్ వచ్చాయి ? ఎంతమంది పనిచేస్తున్నారు? ఫిర్యాదులు ఎలా నమోదు చేస్తున్నారు ? తదితర విషయాలపై ఆరా తీశారు. ఇప్పటికే నగరంలోని అన్ని ప్రాంతాల్లో తమ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ప్రజలు హెల్ప్ లైన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మేనేజర్ హాసీమ్, అధికారులు పాల్గొన్నారు.

## వర్షాలపై సమీక్ష



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఆర్డీఓ రామ్‌మోహన్

**పాకాల:** వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ అధికారులకు సూచనలు చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న మూడు రోజుల పాటు అధికంగా వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని గుర్తు చేశారు. వర్షపాతం వివరాలను ఆర్డీఓ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిత్యానంద బాబు, ఎస్ఐ మహేష్‌బాబు, డాక్టర్ మురళీకృష్ణ, ఈఓపీఆర్డీ శశిరేఖ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రవి చంద్ర, ఏఓ పుష్పావతి, ఏఈఓ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానికులకు దర్శనంపై వివాదాస్పద నిర్ణయం

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానికులకు దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారన్న చర్చ మొదలైంది. భక్తులు ఆధార్‌కార్డు చూపించి పీఆర్వో కార్యాలయంలో స్లిప్ తీసుకుంటేనే ఆలయంలోకి కంచుగడప నుంచి సాధారణ క్యూలో అనుమతి ఇస్తామని ఈవో ఆజాద్ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం పట్టణం నడిబొడ్డున ఉన్న ఆలయం. తిరుమల, శ్రీశైలం, విజయవాడ, అన్నవరం వంటి ఆలయాల మాదిరిగా కొండపై లేపోవడంతో ఈ ఆలయానికి స్థానికులు నిత్యం దర్శనం చేసుకుంటుంటారు. అంతే కాకుండా ఆలయానికి ధూపదీప నైవేద్యాలు లేని సమయంలో స్థానిక ప్రజలే చందాలు వేసుకుని దీపాలు వెలిగించిన రోజులు ఉన్నాయి. అయితే నేడు రాహుకేతు పూజలతో ఆలయం ఆర్థికంగా అభివృద్ధి చెందింది. స్థానిక భక్తులకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి ఏకాంతసేవ వరకు గతంలో అనుమతి ఉండేది. అయితే ఇపుడు ఆలయాధికారులు పీఆర్వో కార్యాలయం వద్ద ఆధార్ కార్డుతో స్లిప్పు ఉంటేనే దర్శనం ఉంటుందని అంటున్నారు. ఉదయం పీఆర్వో కార్యాలయం నుంచి అక్కడి నుంచి స్లిప్పు తీసుకుని వచ్చే సమయానికి గడువు అయిపోతుందని స్థానిక భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో లాగానే సమయం కేటాయించాలని, ఖాళీగా ఉన్న సమయంలో క్యూలో కాకుండా నేరుగా వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

## అన్నా క్యాంటీన్‌లోకి వర్షపునీరు



**శ్రీకాళహస్తి:** స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్ చిన్నపాటి వర్షానికే వరదనీరు లోపలకు వచ్చే పరిస్థితి ఏర్పడింది. గతంలో వర్షపు నీరు వెళ్లడానికి క్యాంటీన్ చివరి వరకు కాలువ ఉండేది. ఆ కాలువకు ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న కాలువ వరకు పైపు ఉండేది. అన్నా క్యాంటీన్ మరమ్మతుల్లో భాగంగా ఆ కాలువను పూడ్చి గట్టు వేశారు. దీంతో ఆ రోడ్డుకు చేరిన వర్షపునీరు అన్న క్యాంటీన్ వద్ద చేరుకుంది. చిన్నపాటి వర్షానికే ఇలా ఉంటే నాలుగురోజుల పాటు వర్షం కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వెంటనే కాలువను తీసి నీరు నిల్వ చేరకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అక్రమ నిర్మాణాలను తొలగించండి



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, అధికారులు

**తిరుపతి తుడా:** రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులు ఆదేశించారు. సోమవారం తెల్లవారుజామున నుంచి వర్షాలు పడుతుండడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన మురుగు నీటి కాలువలు, పేరూరు చెరువు నుంచి నీరు వచ్చే ప్రాంతాలను, కపిలతీర్థం, మాల్వాడి గుండం నుంచి నీరు వెళ్లే ప్రాంతాలను, లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాలను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను కారణంగా మురుగుకాలువల్లో వర్షపునీరు నిలవకుండా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని ఆదేశించారు. ప్రధాన కాలువలతో పాటు పలు ప్రాంతాల్లో కాలువలపై అక్రమ నిర్మాణాల తొలగింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పాన్ చెరువులో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని చెప్పడంతో అధికారులు పరిశీలించారు. హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయంతో పనులు సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆమెతో పాటు ఆర్డీఓ రామ్మోహన్, నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఎస్ఈ శివారెడ్డి, అర్బన్, రూరల్ తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజులు నాయక్, మున్సిపల్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం షాపులు వీరివే...



సీఐ మురళీమోహన్

**పుత్తూరు:** పుత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 18 మద్యం షాపుల కోసం 230 మంది లాటరీలో పోటీ పడ్డారు. సోమవారం ఉదయం 8 గంటలకు తిరుపతిలోని శిల్పారామం అర్బన్ హట్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో డ్రా తీశారు. పుత్తూరు ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ లాటరీలో షాపులు పొందిన వారి వివరాలను మీడియాకు తెలిపారు. పుత్తూరు మండలంలోని 7 షాపులను బీఆర్ హరికృష్ణ, కె.దేవరాజులు, ఎస్ దిలీప్‌కుమార్, ఎం.శ్రీనివాసులు, కె.దేవరాజులు, ఎస్.పద్మనాభం, పి.జగదీష్ దక్కించుకున్నారని తెలిపారు. నారాయణవనం 3 షాపులను ఎం.భరత్‌కుమార్, ధర్మరాజు, జి.ధర్మయ్య, రామచంద్రాపురం 4 షాపులను టి.స్వాతి, కె.హరిప్రసాద్, టి.మోహన్‌రెడ్డి, వి.తులసీరామ్, వడమాలపేట 4 షాపులను పి.రామ్‌మోహన్‌రెడ్డి, ఎస్.వరలక్ష్మి, ఎస్.లక్ష్మీమోనిక, యు.నాగరాజు దక్కించుకున్నట్లు వివరించారు. పుత్తూరులో షాపులు దక్కించుకున్నవారు లైసెన్స్ ఫీజు కింద తొలి ఏడాది రూ.65 లక్షలు, ఇతర మండలాలకు చెందిన వారు రూ.55 లక్షలను ఆరు కంతుల్లో చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ నెల 16 నుంచి వీరు షాపులను నడుపుకోవచ్చునని తెలిపారు.

## ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడండి



అధికారులతో సమీక్షిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

**బుచ్చినాయుడుకండ్రిగ/సత్యవేడు:** భారీ వర్షాలకు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తుపాను రక్షణ చర్యలపై సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ, సత్యవేడులో ఆయన అధికారులతో సమీక్షించారు. మేజర్, మైనర్ చెరువుల పటిష్టతపై ఆరా తీశారు. రానున్న మూడు రోజులపాటు తుపాను ప్రభావం వలన అతి భారీ వర్షాలు పడుతాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇరిగేషన్ అధికారులు వారి పరిధిలోని చెరువులు దెబ్బతినకుండా చూడాలన్నారు. చెరువు కట్టలకు ప్రమాదం అనిపిస్తే వెంటనే తహసీల్దార్లు, ఎంపీడీఓలకు సమాచారం చేరవేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పర్యటించి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వారికి అవసరమైన ఆహారం ,నీటి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తహసీలార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. వర్షాలకు కూలే పూరిండ్లు, గుడిసెలు గుర్తించి ఆ ఇళ్లలో ఉన్న వారిని సమీప పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు తరలించాలన్నారు. నిండు గర్భిణులను గుర్తించి ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పీహెచ్‌సీ సెంటర్లు, కమ్యూనిటీ వైద్యశాలకు తరలించాలన్నారు అలాగే పిల్లలను నీటి గుంతలు వద్దకు పంపకుండా వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలన్నారు. దండోరా ద్వారా ప్రమాద హెచ్చరికలు ప్రజలకు తెలియజేయాలన్నారు. సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో హెల్ప్ లైన్ నంబర్ కంట్రోల్ రూం : 9391516885కు ఎప్పటికప్పుడు కార్యదర్శులు, వీఆర్‌ఓలు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమీక్షలో పశుసంవర్థకశాఖ ఏడీఏ మునిరాజా, తహసీల్దార్లు సుబ్రమణ్యం, టీవీ సుబ్రమణ్యం, ఎంపీడీఓలు త్రివిక్రమ్ రావు, చంద్రశేఖర్, ఎస్ఐలు విశ్వనాథనాయుడు, రామస్వామి, ఎంఈఓలు మునిసుబ్రమణ్యం, రవి, ఉషా, పంచాయతీరాజ్ ఏఈ ఇబ్రహీం ఖాన్, సత్యవేడు మేజర్ పంచాయతీ సెక్రటరీ ముని రవి కుమార్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 19న జాబ్‌మేళా

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 19వ తేదీ శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా కార్యాలయం, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం.శ్రీలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలు బహుళ జాతీయ కంపెనీలు ఈ ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అభ్యర్థులు ఉదయం 9గంటలకు ఆధార్‌కార్డు, విద్యార్హత ధృవపత్రాలు జిరాక్స్, బయోడేటాతో రావాలని చెప్పారు. మేళాకు హాజరయ్యే వారు సంబంధిత వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 79895 09540ను సంప్రదించాలని కోరారు.